# తమస్సులో తపస్సులు

**మా** స్వగ్రామం అటు జిల్లా ముఖ్యపట్టణానికీ యిటు తాలూకా ముఖ్యపట్టణానికీ దగ్గర్లో, గ్రాండ్ ట్రంకురోడ్డు బస్సు మార్గంలో వుంటంలో మా గ్రామీణ నాగరికతలో చాలా పెద్ద మార్పు వచ్చింది. శ్రమ అనుకోకుండా మీరు మావూరికి ఒక్కసారి దయచేస్తే, యీ నాగరికతను బరోమీటర్ మీద కొలిచినట్లు కొలిచి చూడవచ్చని మనవి చేస్తాను. మచ్చుకు ఒకటి రొండు వుదాహరణలిచ్చినా మీరు సహించగలరని నమ్ముతాను. వెనక మా గ్రామానికి గ్రంథాలయోద్యమాధ్యక్షులు వచ్చి వుపన్యాసాలు దంచినప్పుడు వచ్చిన వుద్రేకంతో పదిమందిమీ కూడబలుక్కొని ఏ స్థలంలో పెంకుటింటి గ్రంథాలయం స్థాపించాలనుకున్నామో, ఆ పవిత్రస్థలంలో నేడు భూషయ్యగారి చిన్న కాఫీ హోటలు వెలిసింది. మా ప్రెసిడెంటుగారు (వీరికి సంతకం వరకూ వచ్చు) సహకారసంఘ

షేర్లు పోగు చేసి, వారి స్వంత చిత్తాలో జమకట్టక పూర్వం, మేము కట్టించదలచుకొన్న డాబాయిల్లు గ్రామ సహకార సంఘస్థలంలో మొన్నీ మధ్యనే డేరా సినిమాహాలు వచ్చింది. ఇంకా కావలిస్తే, మా గ్రామంలో గూడా రోజుకు యాభైకి పైగా సిజరు సిగరెట్టు పెట్టెలూ, వారానికి డజనుకు పైగా కొత్త చీట్లపేక పెట్టెలూ నలిగిపోతుంటాయంటే నమ్మండి. అంతేకాదు, గత చరిత్రలో మా వూర్లోని రెండు పార్టీలవారు ఏ విషయంలోనూ ఏకీభవించి వున్నట్లు ఎనభైఏళ్ళ వృద్ధులకు గూడా జ్ఞాపకం లేదు. కాని మొన్నీమధ్యనుండీ, అంటే గ్రంథాలయం కట్టడపు పునాదులు పైకి లేవకుండా చేసేందుకు పెట్టిన అర్జీల్లోనూ ప్రజల షేర్ల ధనాన్ని కూతురు పెళ్ళిలో కట్నంగా అడ్డం పెట్టుకొన్న ప్రెసిడెంటు అరెస్టు తప్పించటంలోనూ, మా ప్రాథమిక పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాలగా మారకుండా అందరూ ఐకమత్యంగా తీసుకొన్న జాగ్రత లోనూ— తరతరాలనుండీ వస్తూన్న ముఠా కక్షలు యిట్టే మాయమై పోయాయని నేను గర్వంగా చెప్పగలను.

ఇటువంటి మా స్వగ్రామాన్ని మీరు పల్లెటూరనిగాని, బస్తీ అని గానిఅనలేరు. ఈ బస్తీ, పల్లె రొండూ కాని మా వూళ్ళోగూడా ధర్మదేవత ఒక పాదం మీదయినా నడుస్తున్నదని నేను విన్నవిస్తే మీరు ఆశ్చర్య మెందుకు పడాలి? మా పడమటి బజారు పురాతన నాగరికతకు శ్రీరామ మంటపం ఆటపట్టు.

ఇక్కడ మీకు ఒక చిన్న విషయం మనవి చేయాలి. మీకు సంవత్సరంలో ఋతువులెట్లా మారుతుంటాయో, మా శ్రీరామ మంటపం మీద సీజన్లు గూడా అట్లా మారుతూ వుంటాయ్. మొన్ననే గడిచింది. పులీ మేక జూదం సీజను. అంతకుముందు సీజను చీట్లపేక సీజను. ప్రస్తుతం జరుగుతోన్నది— పురాణ కాలక్షేప సీజను, వర్తమానమైన ఈ పురాణ కాలక్షేప సీజను పుణ్యమహత్యంతోనే మన కథ గూడా ప్రారంభం

అయింది. ఈ సీజన్ ప్రారంభంలోనే మా ఆచార్యులవారు "ఒరే, మన వూళ్ళో ధర్మం నాలుగు కాళ్ళ మీద సంచరించటం లేదని ఎవ్రరా అనేది?" అని నావంటి సంస్కరణవాదుల్ని సవాల్ చేసి, మంద లించటంకద్దు.

*　　　　*　　　　*

ఆరోజున శ్రీరామ మంటపం అరుగుల మీద స్థల పురాణ కాలక్షేపం నిరాఘాటంగా సాగిపోతున్నది. తీర్థులవారు మంచి పండితులే గాకుండా, కొంచెం సంగీత విద్యలోగూడా ప్రవేశం గలిగిన వారు కావటంలో వారి శిష్యవర్గంలో ఆబాలగోపాలమూ వున్నారు.

తీర్థులవారి కెదురుగా మా పిల్ల బస్తీ వితంతు వర్గం ఆసీనమై వుంది. వారికి ఎడమవేపుగా స్థితిమంతులైన రైతువర్గం కూర్చొనివుంది. వారికి కుడి పక్కగా బీదాబిక్కీ భక్తులూ, యీ దీనభక్త శ్రేణికి వెనకగా పైనచెప్పబడిన బాలబృందమూ, వున్నవి. అందరికన్నా వెనక శ్రేణిలో, మట్టిరోడ్డుకు అందుబాటులో కూర్చొనటంలో మా బాలభక్తులు తమ వర్గ యోగక్షేమాల్ని ఎంతటి పురాణ శ్రవణ కాలంలోనైనా ఏమరిపాటుగా విస్మరించేవాళ్ళు కాదని మీరు గ్రహించవచ్చు.

తీర్థులవారు చదువుతోన్న శ్లోకాన్ని సంపూర్తి చేసి, దాని అర్థ తాత్పర్యాలు పలకకుండానే ఆవులించి, తెరిచిన నోటిలోకి దగ్గరలోనే వేచి వున్న దోమలదండు ప్రవేశించకుండా చిటికెవేసి, ఒక్క తాత్కా లిక క్షణం శిష్యకోటివంక తమ కరుణారస వీక్షణాలు ప్రసరింపజేశారు. అప్పటికే ప్రథమ శ్రేణిలోని వితంతుకోటిలో—తిరుపతి కొండ స్థల మహాత్యకథ ప్రభ సన్నగిల్లి కోడళ్ళ మంకురుతనాన్ని వదిలించే వివిధో పాయాల అన్వేషణకు ప్రాధాన్యత హెచ్చింది. ఆ వర్గంలోనే అక్కడ క్కడ చిలకరించినట్లుగా వున్న నలుగురైదుగురు కోడళ్ళలో కొత్తంగా వచ్చిన తెలుగు సినిమా చిత్రంలోని తారయొక్క వర్ణనలో అభిప్రాయ భేదాలు వచ్చినాయ్. బసవయ్య చౌదరిగారూ, వారి చెట్టుకింది ప్లీడరు

అబ్బాయి నాయుడూ, బట్టతలతో సాక్ష్యాల సీతారామయ్యా — వారి తరువాతి కోర్టు లిటిగేషన్ గురించి మాస్టర్ ప్లాన్ వేస్తున్నారు. తీర్థుల వారికి అపారమైన లోకానుభవం వుంది. వారికి లౌక్యం వంశపారం పర్యపు సంపదగా వస్తోంది.

వారు శిష్యకోటిలో అధిక సంఖ్యాకుల తక్షణాభిరుచుల్ని గమనించినవారై, మరుక్షణమే, రొంటినున్న వెండి పొడుంబుర్రను పదిమంది ముందూ ప్రదర్శించి, అందులోని "షన్ముగానంద ఆఫీసర్ల మద్రాసు నశ్యాన్ని" కొంచెం అసామాన్యమైన పెద్దపట్టులో దట్టించి, తత్ఫలితంగా వచ్చిన బ్రహ్మానందంలో ఒక క్షణం లీనమై, తెలివి తెచ్చుకొని, స్థల పురాణగ్రంథాన్ని మూసి, తమ శిష్యసంతానాన్ని లౌకిక సముపార్జనలో ప్రవేశ పెట్టదలంచినవారై —

"విన్నారా? శాయమ్మగారూ! కోమటి గురవయ్యకు బఱువుగా వుందట" అన్నారు. (ఆరోజు భిక్ష, ప్రసాదం వంతు శాయమ్మగారిది)

గురవయ్య పేరు వినగానే మొగవాళ్ళ సెక్షన్‌లో "బెల్లం" "బెల్లం" అని అస్పష్టపు గుసగుసలు వినిపించినై. చావుబతుకుల్లోవున్న గురవయ్యకూ బెల్లానికీ అవినాభావ సంబంధం వున్నా ఈ గుసగుసలు తీర్థులవారికేమీ నచ్చలేదు.

"గతం గతః అన్నాడు గదండీ శాస్త్రకారుడు? చనిపోయేవాడి సుగుణాలు మాత్రమే లోకం చెప్పుకోవాలనటం ధర్మమే గదా?" అని లౌక్యంగా వారు శిష్యకోటిని మందలించారు. తీర్థులవారి మనస్సులో వున్న విషయం పెద్ద రహస్యమేమీ గాదు. మా గ్రామంలో శ్రేష్టమైన బెల్లం పుట్లకు పుట్లు పండుతుంది. కాని నిరుటి సంవత్సరం మూడు నెలలపాటు, కఱువంటే ఏమిటో ఎరగని మా వూరికి గూడా బెల్లం క్షామం వచ్చింది. చివరకు పెద్ద స్కూలు మాస్టరుగారు గూడా తులం బెల్లం కోసం గడప గడపా తిరగవలసి వచ్చింది. "గురవయ్య కొట్లల్లో మురిగిపోతున్నదని" కొందరూ, "వెంకమనీడు చౌదరీ, గురవయ్యా

కలిసి దొంగతనంగా అమ్ముతున్నారని" కొందరూ విసుగుకొన్నారు. ఏమైతేనేం కరువు కరువుగానే వెళ్ళిపోయింది.

ఇంతలోనే సర్వాంతర్యామి అయిన నరసమ్మగారు "బరువేమిటి స్వామీ? పొద్దునే కిందబెట్టారుగా" అన్నది.

"మహాందాత కదండీ—పుణ్యాత్ముడు. ఏ జన్మలోనో యింత చేసుకు పుట్టాడు. శివాలయానికి ధ్వజస్తంభం దానం చేయించాడుకదండీ" అని తీర్థులవారు మరోసారి ఆవులించారు.

ఈ సందర్భంలో తీర్థులవారు ఒక విషయం మరచిపోయారు. గురవయ్య వేయించిన ధ్వజస్తంభం కలప చౌకబారుదనీ, గాలికి నిలవదనీ ఓంకారం వాస్తు శాస్త్రజ్ఞుడు చెప్పినట్లే, అది మొన్నటి కార్తీకంలో తిరిగి కూలిపోయింది. ఈ మాటలు అప్పటిదాకా వింటూ బెల్లంకొట్టిన రాయివలె కూర్చున్న గురవయ్యగారి జ్ఞాతి హనుమయ్య సంతోషం లోపల దాచుకొని "పొద్దు తిరక్కముందే ప్రాణం పోయిందండీ" అని చల్లగా జారవిడిచాడు.

సభికులందరూ "నారాయణ" "నారాయణ" అని సకల పాపహరుడి నామోచ్చారణ చేశారు.

ఇక సంభాషణంతా మృత్యువుమీదా, పుణ్యం చేసుకొన్న వాళ్ళకు పరలోకంలో దొరికే పర్మిట్ల మీద నడిచింది. చాలామంది సభికులు ప్రశ్నలడుగుతున్నప్పటికి తీర్థులవారి సమాధానాలన్నీ వారి ప్రధాన శిష్యకోటి నుద్దేశించే చెప్పబడుతున్నవి.

ఇంతలోనే బజారులో మేళం వినవచ్చింది. అది రానురాను రామమంటపం సమీపంలోనే వినవచ్చి, మంటపాన్ని గూడా దాటి పోనున్నది. పుణ్యం చేసుకొని చచ్చిపోయిన గురవయ్యగారి శవాన్ని ఆయన నలుగురు కొడుకులూ, పాడె నాలుగు కొమ్ములు పట్టుకొని శోకం మేళం వెనకనే నడుస్తున్నారు. ఆ వెనక గురవయ్యగారి బావమరిది పుల్లయ్యశెట్టి నడుస్తున్నాడు. పుల్లయ్యశెట్టి చేతిలో ఒక పూలపళ్ళెం

వున్నది. ఆ పళ్ళెంలోని పూలలో కాసులూ, పైసలూ కలిసివున్నై. పరలోక యాత్రకేగిన ముసిలాయన రహదారిలో వైతిరణీ నదిలాంటి అడ్డంకులు రాకుండా, ఆయన వ్యాపారంలో భాగం పంచుకొన్న పుల్లయశెట్టి పూలతో పాటు కాన్లూ, పైసలూ దానం చేస్తున్నాడు. శవంమీది పసుపు గుడ్డ మీదపడి పైసలు కిందకు దొర్లిపడుతున్నై. ఆ తర్వాత గురువయ్య మనుషులూ, బంధువులూ నడుస్తున్నారు. చావు వూరేగింపు అది.

శెల్లంతో అత్యంత అవినాభావ సంబంధమున్న గురవయ్యగారి భౌతిక దేహపు అంతిమయాత్రను, శ్రీరామ మంటపంమీది సభికులందరూ మెడలు తిప్పి చూచేరు, కొంచరు "ప్చ ప్చ ప్చ చ్చా" అని తమ సానుభూతిని తెలుపుకొంటున్నారు. ముసలమ్మలకు కొందరికి తమ సొంత కేసుల్ని గురవయ్య గతితో పోల్చుకొనగానే కళ్ళనీళ్ళు వచ్చి కొత్తదిగులుతో యింటిదారి కనిపించింది. ఇన్నాళ్లూ గురవయ్య పోటీదారు హనుమయ్య తన పీడా వదిలిందని మొదట్లో అనుకొని వెంటనే పాపభీతితో నరకలోకంలోని, కాగుతూన్న నూనె పాతరస్మృతికి వచ్చి, రెండు చెంపలూ ఎవరూ చూడకుండా వాయించుకొని, తీర్థులవారు చూచేటట్లుగా విచారపూరితమైన ముఖం పెట్టాడు. దొంగసాక్ష్యాల సీతారామయ్యకు తను యీ మధ్యనే గురవయ్యనుండి తీసుకొన్న చేబదులు సంగతి, చచ్చిపోతూ తన "వీలునామా"లో వుదాహరించ లేదుగదా అని భయపడుతున్నాడు.

కాని బసవయ్య చౌదరికి స్మశానవైరాగ్యం అంకురించి "స్వామీ, యీ దేహం గతేమీగాను?" అని అర్థం లేకుండా ప్రశ్నించాడు.

"దేహం మట్టిలోమట్టి, పంచతాభూతాల్లో పంచభూతాలు. ఇక ఆత్మ ఎగిరిపోయి అనంతాత్మలో కలిస్తే యీ దేహాల లెఖ్కేవిఁటి, చౌదరి గారూ?"

కేవలం స్వలాభం మాత్రమే ఆలోచించి, యీ ఐహిక, ఆముష్మిక వేదాంతమూ, స్మశాన వైరాగ్యమూ యీ షణ్మాత్రంగూడా

పట్టించుకోని పిల్లలందరూ, శ్రీరామ మంటపాన్ని వదిలి గురవయ్య అంతిమ యాత్రకు ప్రేక్షకులుగా చేరారు. అందులో పన్నెండేళ్ళ బక్క యాదవులు ఒకడు. ఆస్థిలేని రామదాసు కొడుకు, బక్కయాదవులు.

యాదవులు కళ్ళన్నీ పుల్లయ్యశెట్టిమీదనే వున్నై. ముంత కజ్జాయాన్ని పిసికినట్లు పుల్లయ్యశెట్టి పూలను పిసకటం, శనగల్లో గులక రాళ్ళు కలిపినట్లు ఆ పూలలో పైసలు కలపటం—యాదవులు ఆశ్చర్యంతో గమనించాడు. గురవయ్య శవం వెనక యిప్పుడు దాదాపు వందమంది దాకా నడుస్తున్నారు. బంధువులే గాకుండా, చచ్చిపోయిన జీవికి బాకీవున్న సన్నకారు జనమంతా, గురవయ్య వారసులు గండ్ర గత్తెర్లు తేకుండా, నిశ్శబ్దంగా, గుంపులు గుంపులుగా నడుస్తున్నారు.

యాదవులు పెద్దెరిగిన తర్వాత యిట్లాంటి వుత్సవం చూడటానికిదే ప్రథమం. బజార్లో యీ వూరేగింపు వుత్తరాది ప్రయాణం చేస్తూండగా, యిళ్లల్లోని ఆడవాళ్ళందరూ ఎవరిపనులు వాళ్ళు వదిలిపెట్టి వీధి గుమ్మాల్లోకి వచ్చి శవాన్ని వింతగా, శబ్దమేమీ చేయకుండా చూస్తుండటం గూడా—యాదవులి మనస్సులోని 'ఆ'ను రేకెత్తించింది. చేబ్రోలు కోరుకొండ తిరణాలతో యీ వుత్సవాన్ని పోల్చుకొంటూ, తక్కిన పిల్లల్తో పైసలకోసం పోటీలు పడ్తూ యాదవులు, తనకు ఎన్నడూ నాలుగు గింజల శనగలు గూడా కొసరుపెట్టని, గురవయ్య ప్రాణం లేని దేహం వెనక పోసాగాడు.

బక్కయాదవులు తక్కిన పిల్లల్తో పోల్చిచూస్తే పక్కా సిసింద్రీ. పుల్లయ్యశెట్టి మురుగుల చెయ్యి బరువుగా, బావగారి పుణ్యంకోసం పైకి లేవగానే, ఒక్క దూకులో ముందుకుపోయి, గద్ద కళ్ళతో పూల నుండి పైసల్ని గుర్తుపట్టి, ఏరుకొని బొడ్డుదగ్గర చిన్న సంచీలో దాచుకోని, తక్కిన కక్షిదారుల జెలసీకి అందకుండా పోట్లాడుతూ, యానాది మల్లిగాడికి మాటకు మాటబెడుతూ, ఎటికలసింగడిని మోచేతి పదును ఎముకల్తో పొడుస్తూ, జబర్దస్తీగా, ముందు ఆలోచన చేస్తూ నడిచాడు.

ఒక్క యాదవులి నైపుణ్యంతో ఆరోజున ఒక్క యానాది మల్లిగాడికి తప్పితే, యింకో పిల్లవాడి కెవరికీ దమ్మిడీ దొరక లేదు. వాళ్ళందరూ ఏడుపు ముఖాల్తోనే యాదవుల్ని దబాయించారు. లాభంలేక పోయింది బ్రతిమిలాడారు. ఫలితం కలగలేదు. చివరకు యాదవులి బలహీనపు పాయింటు—దయ్యాల భయం సృష్టించారు. యాదవులు బొడ్లోనుంచి పైసా పైకిరాలేదు. యాదవు లిప్పుడు బొంబాయిలో డబ్బు వడ్డీకిచ్చి సినిమాలు తీయించే గుజరాతీ సేఠ్, బీద కధకుణ్ని తరిమివేసేటప్పుడు పెట్టే—ముఖవైఖరి పెట్టి అందర్నీ, గదమాయించాడు. ఆ గ్యాంగు నుండి క్షణంలో తప్పించుకొని, గమ్మళ్ల యెంకమ్మ యింటి ముందు పొద్దుట్నించీ యీగలు ముసుర్తున్న జంతికలూ, నిన్నటి చద్ది పకోడీలు, ముదురుముంజలూ కొనుక్కు తిన్నాడు. అందులోగూడా తోటివాళ్ళకు భాగం పెట్టలేదు.

యాదవులి కడుపులో "టిఫిన్" సగం జీర్ణమై పోయినా గ్యాంగు అతన్ని వదిలి పెట్టలేదు.

"అరే సస్తావురా!" అని కాపుల పిల్లాడు సిన కన్నయ్య కోపం వెళ్ళగెక్కాడు.

"ఆ పైసలమీన దెయ్యంవుందిలే" అని సింగడు ఖచ్చితంగా జెప్పాడు.

వంకాయల మాణిక్యం కొడుకు యల్లమంద యింకోమెట్టు ముందుకుబోయి "సచ్చినోడిమీది పైచల్తోదించే దేవుడి శాస్తే గందరా! తూరు బ్బజారు బుక్కా పిలుపుగాడు జచ్చింది దేనికిరా? ఆడుచ్చ చానంలోపైచలు దొరికితే చాంఎయ్యకొట్లో గుగ్గిళ్ళుతించే గాదంటరా? నాకుదెల్చులే! నువ్వుగూడా తొమ్మిదోనాటికి బుడింగిమంటావులే."

ఉలకలేదు యాదవులు. పలకలేదు యాదవులు. ఒక్క క్షణం వుండి ఒళ్ళంతా దులుపుకొని, మావూరి ధర్మకర్తలుండగానే పాడుబడ్డ ''చివాలయం" మొగదలకెళ్ళి, వినాయకుడి పాదాలముందు కూర్చు

న్నాడు చీకట్లో.

నిజానికి యాదవులు ఏదో భయంతోనే అక్కడకు వచ్చాడు. వాడి ఆత్మ నిశ్శబ్దాన్నీ, శాంతినీ కోరి యీ ఏకాంత ప్రదేశానికి తీసుకు వచ్చింది. వాడికి చీకట్లో వంకాయల మాణిక్యం కొడుకు మాటలే తిరిగి తిరిగి స్మృతికి రాసాగినై. నిజమేనా? అనుకొన్నాడు. బుక్కా పిలుపు గాడు చచ్చింది అందుకేనా? యల్లమందగాడు గప్పాలు కొట్టే బాపతు కాదే? ఛా! యదవకు ఒక్క జంతికిస్తే ఏంబోయేది? నిజమా? బుకాయింపా?

యాదవులు చీకట్లో చీకటైపోయాడు. వాడికి కళ్ళవెంట నీళ్ళు వచ్చినై. తల తిరిగిపోయింది. భయంవేసి పెద్దగా అరుద్దా మను కొన్నాడు. ఎదురుగావున్న నంది విగ్రహం కదిలినట్లయింది. కాని గొంతు పెగల్లేదు. కాళ్ళు చేతులు చచ్చుబడి దేహం కదల లేదు. వాడి వ్యక్త మనస్సుకు శరీరంమీద అధికారం తగ్గిపోయి అవ్యక్త మనస్సుకు పూర్తి కంట్రోలు వచ్చేసింది. ఇంతలోనే నిద్ర సోలుతూ తూలుతూ వచ్చింది. మనస్సూ, దేహమూ అలిసిపోయి, ప్రమధ గణ నాయకు డైన విఘ్నేశ్వరుడి పాదాలముందు సుషుప్త్యావస్థలో యాదవులు పడి పోయాడు. నిద్రలో వాడికి కలవచ్చింది. అది ఆలోచనల కల.

"చావటమంటే ఎంతదర్జా? తనుగూడా చస్తేనో? నాయనట్లా గురవయ్య బావమరిది పుల్లయ్యశెట్టిలాగా పూలూ, పైసలూ తనమీద చల్లుతుంటే? ఊళ్ళో జనమంతా పను లాపుకొని తన వెంటనే అట్లా వస్తారు కాబోలు! యీ "సేతగాని యెదవనాగన్నలు"— చింగన్నా, ముల్లిగాడూ, యల్లమందాయ్— అంతా రావాల్చిందేగా? ఎవడి కోసం??"

ఆలోచనల కల నిజమైన కలలోకి మారింది. ఈసారి బుక్కా పిలుపుగాడు కనిపించాడు. వాడికి కండలు లేవు. ఒట్టి ఎముకలపోగు.

"ఏరా — పిలుపుగా? నువ్వు చచ్చిపోయావంట నిజమేనా?"

అని తను అడిగాడు.

వాడు నవ్వి — "అవును — అబద్ధమేముంది? నేను గన బట్టల్లా?" అన్నాడు.

"అరేయ్, ఎందుకు జచ్చావురా!"

"సచ్చినోళ్ళమీది పైచలేరుకుంటే!"

ఈమాటతో యాదవులికి జాగ్రగద వస్తవచ్చింది. మళ్ళీ దెయ్యాల లోకంనుండి భూమ్మీదకు దూకినట్లయింది. భయంతో అర్థంలేని అరుపులు అరవసాగాడు. ఈ భయంకర శబ్దానికి గుళ్ళో ధర్మకర్తల ఏజెంట్లయిన గబ్బిలాలు లేచి చెదిరి అటూ ఇటూ ఎగరసాగినాయ్. యాదవులు వినాయకుణ్ని కావిలించుకొన్నాడు. కాని గబ్బిలాలు తలమీదనే రెప రెప కొట్టుకొంటున్నాయ్. శిథిల దేవాలయపు మొండి గోడలు చీకట్లో ఆకాశమెత్తుగా పెఱిగి పోతున్నట్లు యాదవులికి కనిపించింది. గుడి వెనక చింతచెట్లనుండి గూడా ఏవో శబ్దాలు వినిపించినై. నిజానికది వానశబ్దం.

వినాయకుడి రక్షణ వదిలి యాదవులు బయటకు పరుగు లంకించుకున్నాడు ప్రాణభయంతో. "అయ్యో, ఓరిబాబో! నాయెునో! బాబో!" అని అరుచుకుంటూ. బయట ఎదురుదెబ్బ తగిలి బొక్కబోర్లా పడి లేవబోతూండగా, తండ్రి వానలో గొంగళి కప్పుకొని తనను వెతుక్కుంటూ వచ్చాడు.

రామదాసు బక్క యాదవుల్ని పట్టుకొని —

"ఏరా! ఒళ్లు కాగిపోతున్నది. జొరంవచ్చిందా?" అని అడిగాడు.

* * *

యాదవులు జ్వరం మరునాడుగూడా తగ్గలేదు. రామదాసు మంగలి వైద్యుణ్ని పసరు అడిగేందుకు వెళ్లాడు. యాదవులికి రాత్రి అనుభవం కలో నిజమో అర్థం కాలేదు. అర్థంకాక — "అమ్మా, బుక్కా పిలుపుగాణ్ని సూశానే?" అన్నాడు తల్లితో.

లచ్చమ్మ కొంచెం ఆశ్చర్యంగా కొడుకువంక జూసి – "నీకేమి రా పిచ్చి? పిలుపుగాడు జచ్చి ఆరునెల్లయితే" అని సమాధానం యిచ్చింది.

"కాదే! నిజవేఁ!" అని యాదవులు అనబోయాడు గాని మత్తు వచ్చి మాట్లాడలేదు. ఆ మగతలో మళ్ళీ బుక్కా పిలుపుగాడు కనిపించాడు.

ఆ మత్తు మత్తు రాత్రికిగాని తెలియలేదు యాదవులికి. జ్వరం పేలిపోతున్నది. వాడి ఒంటిమీద ఏ గుడ్డా నిలవటం లేదు. ఈ ఒక్క రోజు జ్వరానికే చిక్కి శల్యమైపోయాడు. రామదాసు ఒకటికి రెండు సార్లు మంగలి వైద్యుడిచుట్టూ తిరిగాడు. తండ్రి జావయిస్తూండగా యాదవులు జాలిగా చూశాడు.

"ఈత గొట్టావా తూర్పు కాలవలో?" అని రామదాసు అడిగాడు.

"లే...దే...! ఉ...హూ...!"

''మరి జ్వరం దేనికిరా?''

యాదవులు సమాధానం చెప్పక, కళ్ళు మూసుకున్నాడు. కొంచెం సేపటికి కళ్ళు తెరిచి –

"అ...య్యా...!" అని తండ్రిని పిలిచాడు.

''అయ్యా ... సచ్చినోళ్ళమీది పైసలేరుకుంటే తిరిగి బతికున్నోళ్ళు సస్తారా?''

''నువ్వేరుకున్నావా?''

''అహ! బుక్కా పిలుపుగాడు.''

''పిలుపుగాడికి చన్నిపాత జొరంవచ్చి జచ్చిండు''

యాదవులికి యీ సమాధానం ఏమీ నచ్చలేదు. నచ్చక తండ్రి బయటకు పోవటంచూసి తల్లిని పిలిచి అదేప్రశ్న వేశాడు. పిచ్చి లచ్చమ్మ ''నిజమే'' నన్నది.

నాలుగురోజులు గడిచినా జ్వరం తగ్గుముఖం చూపలేదు. రోజు రోజుకూ రోగి చిక్కిపోతూన్నాడు. రామదాసు, కొడుకు కుక్కిమంచపు

కాళ్లగట్టున గూర్చొని కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాడు. అదిచూచి యాదవులు—''అ...య్యా...'' అని పిలిచాడు. కాని ఏదో అవ్యక్తంగా, హస్తాల్తో గుర్తులు చూపాడు.

''అయ్యా... కో...ప...మా...?''

''ఊ...హూ'' అని తలూపాడు రామదాసు కేమీ అర్థంగాక.

''నేనే నేనే?''

''ఏవిఁటి?''

''కోమటి గురవయ్యమీది పైచలు''

''ఆరి పిచ్చెదవకానా, ఏమయితే?''

''కా...దు...''

''మ...రి...''

''బుక్కా...పిలుపుగాడు''

రోగి పెద్దగా అరిచాడు. మూలిగి మగతలో తిరిగి పడిపోయాడు

* * *

ఎనిమిదిరోజుల జ్వరానికి అంతులేదు. ఎనిమిదోరోజున యాదవులు తన స్నేహితులు సింగణ్ని, మాణిక్యం కొడుకు యల్లమందను యానాది ముల్లిగాడిని, కావుల పిల్లాడు సినకన్నయ్యనూ పిలిపించుకొన్నాడు.

''అ...రే...య్... యల్లమందా...నువ్వు జె...ప్పింది... నిజంరా!''

''ఏది???''

''బుక్కా పిలుపుగాడి మాట''

యల్లమంద నవ్వి ''అబద్దం. అబద్దం. నిన్ను బయాలు బెట్టేందుకు జెప్పాన్నా.''

యాదవులు జీవంలేని గొంతుతోనే, భావి అడుగునుండి

మాట్లాడాడు.

నిజంరా...ఆ..డు..నాగ్గనబడిచెప్పిం..డు.."

పిల్లలందరూ దిగాలుపడి చూశారు. అందరికీ కళ్ళనీళ్ళు వచ్చినై. వంకాయల మాణిక్యం కొడుకు యల్లమంద పెద్దగా ఏడ్చాడు.

మళ్ళీ యాదవులు మాట్లాడాడు.

"అ...రే...యాడొ...వ్వొద్దురా...నేను బుక్కా పిలువుగాడి దగ్గిరి కెళ్తాన్నా! మా బాబుకు జెప్పి, నేను జచ్చినాక పైచలు జల్లిపిస్తాను. యల్లా! నువ్వేరుకో: సింగడికియ్యి...సినకనకయ్యకు...ముల్లి... గాడికి చెరిసగంగా యియ్యిరా."

యాదవులికి మళ్ళీ తెలివి అర్ధరాత్రికి వచ్చింది. రామదాసు కొడుకుమంచం వదల్లేదు.

"అ...య్యా...నేను జస్తే...గురవయ్యకు జల్లి...నట్లు... పైసలు...జల్లుతావు...గా..."

ఈమాటు రామదాసు బావురుమని ఏడ్చాడు. ఆరాత్రి భళ్ళున తెల్లవారింది. రాత్రంతాయాదవులు కలవరిస్తూనే వున్నాడు. జ్వరం గంటగంటకూ ముదిరిపోయింది. మంగలి వైద్యుడు గరళం పోసే ఏర్పాట్లుజేసి, పన్నెండేళ్ళ యాదవులి మాడుగీచి పట్టువేస్తున్నాడు. కాని వంకాయల మాణిక్యం కొడుకు యల్లమంద భవిష్యత్ చెప్పినట్లు తొమ్మిదో నాటికల్లా యాదవులు యిహలోకయాత్ర చాలించాడు. ○

భారతి —

నందన జ్యేష్ఠము